11వ అధ్యాయము

# పరిశుద్ధాత్మలో బాప్తిస్మం

అపొ॥ కార్యముల గ్రంథము చదువుతున్నప్పుడు ఆది సంఘములో జరిగిన పరిశుద్ధాత్మ కార్యాలు ప్రతి పేజీలో సాక్షాత్కరిస్తాయి. పరిశుద్ధాత్మ కార్యాలు అపొ॥కార్యముల గ్రంథంలో తొలగించినచొ ఇక ఆ గ్రంథంలో ఏమీ ఉండవు. వాస్తవంగా ఆయన మొట్టమొదటి శిష్యులకు "ఈ ప్రపంచం తలక్రిందులుచేసేలా" వారికి అధికారాన్ని ఇచ్చాడు (అపొ 17:6 చూడుము).

నేడు ప్రపంచములో ఏ ప్రాంతములో అయితే సంఘం వేగంగా అభివృద్ధి చెందుతున్నదో ఆ ప్రాంతాలలో ఉన్న క్రీస్తు అనుచరులు అందరూ వాస్తవంగా పరిశుద్ధాత్మునికి లోబడిపోయి తద్వార ఆయన శక్తిని పొందియుండినారు. మనం ఒక పనిని మన ప్రయత్నాలలో పూర్తి చేయటానికి 10 సం॥లు కాలం పడితే అదే పనిని పరిశుద్ధాత్ముడు 10 సెకనులలో పూర్తి చేయగలడు. కనుక శిష్యులను చేయు దైవసేవకుడు విశ్వాసుల జీవితములో మరియు వారు చేయు పరిచర్యలో పరిశుద్ధాత్ముడు చేయు కార్యముల గురించి లేఖనములు ఏమి చెబుతున్నాయి అన్నది తెలుసు కోవటం చాలా అవసరం.

అపొ॥ గ్రంథములో విశ్వాసులు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొంది, తమ పరిచర్యకు తగిన శక్తి పొందటం గురించిన ఉదాహరణలు మనం తరచుగా చూస్తాం. ఈ గ్రంథం అధ్యాయనం చేయటం వివేకమైనపని, ఎందుకంటే వారు అనుభవించిన పరిశుద్ధాత్మ అద్భుత సహాయాన్ని సాధ్యమైతే మనమూ పొందే అవకాశం ఉంది. అటువంటి అద్భుతమైన పరిశుద్ధాత్మ కార్యాలు ఆనాటి అసలైన అపొస్తలులకే పరిమితం అని కొందరు వాదిస్తున్నప్పటికీ లేఖనములు కాని లేదా చరిత్రపరమైన ఆధారాలు కాని లేదా సహేతుకమైన ఆధారాలు ఏవీ కూడా వారి వాదనను బల పరుస్తున్నట్లుగా నేను కనుగొన లేదు. ఇది అవిశ్వాసము నుండి వచ్చిన అభిప్రాయము. దేవుని వాక్యం ఏమి వాగ్దానం చేస్తున్నదో దానిని నమ్మే వారు ఆ వాగ్దాన ఆశీర్వాదమును పొందగలరు. అవిశ్వాసులైన ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమిని ప్రవేశించలేక పోయినట్లుగా, నేడు దేవుని వాగ్దానాలను విశ్వసించని వారు తమకొరకు దేవుడు సిద్ధపరచిన దానిని పొందలేకపోతున్నారు. నీవు ఏ తరగతికి చెందావు? నా మట్టుకు నేను విశ్వాసుల తరగతికి చెందినవాడను.

## పరిశుద్ధాత్మ చేయు రెండు కార్యాలు

ప్రతి వ్యక్తి యేసుప్రభువు నందు నిజముగా విశ్వసించినట్లయితే అతని జీవితంలో పరిశుద్ధాత్మ కార్యాలు చూస్తాడు. అతని అంతరంగిక పురుషుడు లేదా అతని ఆత్మ పరిశుద్ధాత్మ ద్వార నూతన స్వభావమును పొందుతాడు (తీతుకు 3:5). ఇక మీదట అతనిలో పరిశుద్ధాత్మ నివసిస్తాడు (రోమా 8:9; 1 కొరింథీ 6:19). అతడు "ఆత్మ మూలముగాను జీవిస్తాడు" (యోహాను

3:5). దీనిని అర్థం చేసుకోకుండా అనేకమంది పెంతుకోస్తు క్రైస్తవులు తమ విశ్వాసులతో వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొంది భాషల్లో మాట్లాడితేనే తప్ప పరిశుద్ధాత్మను కలిగియుండినట్లుకాదు అని తప్పుడు బోధలు చేస్తుంటారు. కాని లేఖనములలో మరియు కొందరి అనుభవముల ద్వారా ఇది స్పష్టమవుతున్నది. అనేక మంది పెంతుకోస్తు సంఘానికి చెందనివారు కొంతమంది పెంతుకోస్తు క్రైస్తవుల కన్న తమ జీవితాలలో పరిశుద్ధాత్మ అనుభవాలను హెచ్చుగా పొందుతూ ఉంటారు. వారు గలతీ 5:22-23లో వివరించబడిన పరిశుద్ధాత్మ ఫలాలను కలిగి ఉంటారు. మనలో పరిశుద్ధాత్మ లేకుండా ఆ ఫలాలను కలిగివుండటం అసాధ్యం.

ఒకడు ఆత్మమూలముగా ***జన్మించినంత*** మాత్రానా పరిశుద్ధాత్మలో ***బాప్తిస్మం*** పొంది ఉంటాడని చెప్పలేం. బైబిలు ప్రకారం చెప్పాలంటే పరిశుద్ధాత్మ ద్వార జన్మించటం మరియు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందటం రెండు విభిన్న అనుభవాలు.

ఈ అంశాన్ని మనం పరిశీలించటం మొదలెట్టాం గనుక ముందుగా సమరయలోని ఆ బావి దగ్గర యేసు ఆ స్త్రీతో పరిశుద్ధాత్మ గురించి ఏమి చెప్పాడో గమనిద్దాం:

> అందుకు యేసు - నీవు దేవుని వరమును నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్న వాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను ఎరుగుదువు, ఆయన నీకు జీవ జలమిచ్చునని ఆమెతో చెప్పెను. ఈ నీళ్లు త్రాగు ప్రతివాడును మరల దప్పిగొనును; నేనిచ్చు నీళ్లు త్రాగు వాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను (యోహాను 4:10, 13-14)

యేసు చెప్పే జీవజలము, విశ్వాసుల హృదయములో నివసించే పరిశుద్ధాత్మను సూచిస్తున్నది అన్న అభిప్రాయానికి రావటం ఎంతైన సమంజసం. ఆ తరువాత యోహాను సువార్తలో యేసు తిరిగి ఆ మాటనే చెబుతున్నాడు "జీవజలం" కనుక ఆయన పరిశుద్ధాత్మ గురించే మాట్లాడుతున్నాడు అన్న దాంట్లో సందేహమే లేదు:

> ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసు నిలిచి "ఎవడైనను దప్పిగొనిన యెడల నాయొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులో నుండి జీవజలనదులు పారునని బిగ్గరగా చెప్పెను." తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మనుగూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహించబడియుండలేదు (యోహాను 7:37-39).

ఇక్కడ యేసు జీవజలము "నిత్యజీవపు ఊటనిచ్చెడి బావిగా" మారుతుందని చెప్పటం లేదు, దాని బదులుగా అది విశ్వాసి అంతరంగంలో ప్రవహించెడి నదిగా మారుతుందని

అయన భావం.

యోహాను సువార్తలోని ఈ రెండు లేఖన భాగములు ఆత్మద్వార జన్మించటం మరియు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందటం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చాలా చక్కగా తెలియజేస్తున్నాయి. ఆత్మ మూలముగా జన్మించటం అనేది ప్రధానంగా తిరిగి జన్మించిన వారియొక్క మేలుకోసమే అని చెప్పవచ్చు. అనగా అతను నిత్యజీవాన్ని అనుభవించగలడు. ఒకవ్యక్తి ఆత్మమూలముగా తిరిగి జన్మించినప్పుడు అతనిలో ఆత్మ అనెడి జలాశయము ఏర్పడుతుంది, అది అతనికి నిత్యజీవాన్ని అనుగ్రహిస్తుంది.

పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందటం అనేది ప్రధానంగా ఇతరుల మేలుకొరకే అని చెప్పవచ్చు. ఇది విశ్వాసులు పరిశుద్ధాత్మ శక్తితో ఇతరులకు పరిచర్యచేసేలా వారిని సిద్ధపరుస్తుంది. "జీవజల నదులు" వారి అంతరంగంలో ప్రవహిస్తాయి, పరిశుద్ధాత్మ శక్తి ద్వార ఇతరులకు దేవుని ఆశీర్వాదాలను తీసుకొని వస్తుంది

## పరిశుద్ధాత్మ బాప్తిస్మం ఎందుకు పొందాలి

ఇతరులకు పరిచర్య చేయడానికి పరిశుద్ధాత్మ సహాయం మనకెంతో అవసరం. ఆయన సహాయం లేకుండా ఇతర జాతుల వారి నందరినీ శిష్యులుగా చేయలేము. అందుకనే ప్రపంచం సువార్తను వినగలదని విశ్వాసులుకు పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని యేసు వాగ్దానం చేశాడు. కనుకనే ఆయన తన శిస్యులతో :

> ఇదిగో నా తండ్రి వాగ్దానం చేసినది మీ మీదికి పంపుచున్నాను. మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడి అని చెప్పాడు (లూకా 24:49).

> ఇంకా యేసు చెప్పిన మాటలను లూకా యిలా నమోదు చేశాడు

> కాలములను సమయములను తండ్రి తన స్వాధీన మందుంచుకొని యున్నాడు. వాటిని తెలిసికొనుట మీ పని కాదు. అయినను పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు. గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను (అపొ 1:7-8).

"మీరు పైనుండి శక్తిపొందు వరకు" యెరూషలేమును విడిచి వెళ్ళవద్దని తన శిష్యులతో చెప్పాడు యేసు. లేకుంటే వారిలో శక్తి వుండదని ఆయన వారికి అప్పగించిన పనిని వారు చేయలేరని ఆయనకు తెలుసు. ఒకసారి వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందారని మనకు తెలుసు. అయినా సువార్తను విస్తరింపచేయడంలో దేవుడు వారిని మానవ ఊహాతీతంగా వాడుకోవడం మొదలు పెట్టాడు.

పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందిన తర్వాత ప్రపంచంలో లక్షలాది మంది క్రైస్తవులు మరిముఖ్యంగా రక్షణ పొందని వారికి సాక్ష్యం చెబుతున్నప్పుడు నూతన పరిమాణంలో శక్తిని

పొందిన అనుభూతిని పొందారు. అప్పుడు వారి మాటలు యితరులలో ఎంతో నమ్మకాన్ని కలిగించాయని, కొన్నిసార్లు తమకు తెలియని లేఖన భాగాలను వివరించినట్లు వారు తెలుసుకోగలిగారు. కొందరైతే ప్రత్యేకంగా ఒక నిర్ణీత అంటే సువార్తీకరణ వంటి విశేషమైన పరిచర్యకు పిలువబడ్డారని తెలుసుకోగలిగారు. మరి కొందరు తమను దేవుడు తన చిత్త ప్రకారం మానవాతీతమైన ఆత్మవరాలతో వివిధ పరిచర్యలలో వాడుకొన్నాడని తెలుసుకొన్నారు. వారి అనుభవం పూర్తిగా బైబిలు ఆధారమైనది. వారి అనుభవాన్ని వ్యతిరేకించిన వారి వ్యతిరేకతకు లేఖనాధారం లేదు. అలాంటి వారు నిజంగా దేవునికి వ్యతిరేకంగా పోరాడతున్నవారే.

క్రీస్తు తన తల్లియైన మరియ గర్భములో ఆత్మగా ప్రవేశించి ఆత్మవలన జన్మించాడు. అలాంటి క్రీస్తును అనుకరించడానికి పిలువబడిన మనం పరిశుద్ధాత్మతో ఆయన వలె అనుభవాన్ని అనుకరించాలనడం ఆశ్చర్యాన్ని కలిగించదు (మత్తయి1:20). ఆత్మ వలన జన్మించిన ఆయన తన పరిచర్యను ప్రారంభించడానికి ముందు ఆత్మలో బాప్తిస్మాన్ని పొందాడు (మత్తయి 3:16). తన పరిచర్యకు సిద్ధపడడానికి యేసు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందాల్సిన అవసరత కలిగినప్పుడు మనం పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందడం ఇంకెంత అవసరమో ఆలోచించండి.

## ఆత్మలో బాప్తిస్మానికి మొదటి నిదర్శనం

ఒక విశ్వాసి పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందాడనడానికి మొదటి అనుభవం అతడు నూతన భాషలో మాట్లాడుతాడు. దానిని లేఖనాలు "నూతన భాషలు" లేక "అన్య భాషలు" అని అంటున్నాయి. ఈ నిజాన్ని అనేక లేఖనాలు బలపరుస్తున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

మొదటిది తన ఆరోహణమునకు ముందు చివరి క్షణాలలో యేసు తన శిష్యులతో తనను వెంబడించే వారిలో కనబడే సూచక క్రియలలో ఒకటి, వారు అన్యభాషలలో మాట్లాడటం అని చెప్పాడు:

> మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును. నమ్మిన వారి వలన ఈ సూచక క్రియలు కనబడును. ఏమనగా నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు. క్రొత్త భాషలు మాటలాడుదురు" (మార్కు 16:15-17).

ఈ మాటలు ప్రాచీన రాత ప్రతుల్లో లేవు కనుక అవి మన బైబిలులో లేవు అని కొందరు వ్యాఖ్యాతలు అంటుంటారు. ఆయినా చాలా పురాతన రాత ప్రతులు వాటిని వ్రాశాయి. నేను చదివిన అనేక ఇంగ్లీషు అనువాదాలలో ఏదీ కూడా ఈ మాటలను విడిచిపెట్ట లేదు. అంతేగాక ఈ వచనాలలో యేసు ఏమి చెప్పాడో దానిని ఆది సంఘం అనుభవముతో సంపూర్తిగా అన్వయించి అపొస్తలుల కార్యాల గ్రంథంలో వ్రాశారు.

విశ్వాసులు తమ పరిచర్యకు ముందుగా పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందినట్లు అపొ॥కార్య గ్రంథంలో అయిదు రుజువులున్నాయి. ఆ అయిదింటిని పరిశీలించేటప్పుడు 1. పరిశుద్ధాత్మలో బాప్తిస్మం రక్షణానుభవానికి తర్వాత కలిగే అనుభవమా? 2. దానిని పొందిన

వారు క్రొత్త భాషలో మాట్లాడుతారా? అన్న రెండు ప్రశ్నలను మనలో ఉంచుకొని పరిశీలిద్దాం. అలాచేసినప్పుడు నేటి విశ్వాసుల పట్ల దేవుని చిత్తం ఏమిటో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

## యెరూషలేము

మొదటి రుజువు అపొ॥ 2లో చూస్తాం. సందర్భం - పెంతెకొస్తు రోజున నూట ఇరవై మంది శిష్యులు పరిశుద్ధాత్మలో బాప్తిస్మాన్ని పొందారు:

> పెంతెకోస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచుబలమైన గాలివంటి యొక ధ్వని అకాశమునుండి ఆకస్మాత్తుగా వారు కూర్చుండి యున్న ఇల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కరి మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడ సాగిరి (అపొ 2:1-4)

అక్కడున్న నూట ఇరవైమంది విశ్వాసులు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందడానికి ముందే అంటే అప్పటికే రక్షణ పొంది తిరిగి జన్మించిన వారనడంలో సందేహం లేదు. కాగా వారు రక్షణానుభవం పొందిన తర్వాతనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందారనడం స్పష్టంగా తెలుస్తుంది. అయినప్పటికి అప్పటి వరకు సంఘానికి పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని అనుగ్రహించ లేదు గనుక అంతకంటె ముందు వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందే అవకాశం లేనేలేదు.

పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన తర్వాత వారు అన్యభాషలలో మాట్లాడారన్నది స్పష్టం.

## సమరయ

విశ్వాసులు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందారనడానికి రెండో నిదర్శనం అపొ 8లో చూస్తాం. ఇందులో ఫిలిప్పు సమరయ పట్టణము వరకు వెళ్లి అక్కడ సువార్తను ప్రకటించాడు.

ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసు క్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించు చుండగా వారతని (సమరయులు) నమ్మి పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి. అప్పుడు సీమోను కూడ నమ్మి బాప్తిస్మము పొంది పిలిప్పును ఎడబాయకుండి, సూచక క్రియలును గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతి నొందెను. సమరయ వారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరూషలేములోని అపొస్తలులు విని, పేతురును యోహానును వారియెద్దకు పంపిరి. వీరు వచ్చి వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారికొరకు ప్రార్థనచేసిరి. అంతకు ముందు వారిలో ఎవరి మీదను ఆయన దిగియుండ లేదు, వారు ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము మాత్రము పొందియుండిరి (అపొ 8:12-16).

సమరయ క్రైస్తవులు రక్షణ పొందిన తర్వాత రెండవ అనుభవంగా పరిశుద్ధాత్మలో

బాప్తిస్మాన్ని పొందడం స్పష్టం. పేతురు యోహానులు సమరయుల దగ్గరకు రాకముందే వారు "దేవుని వాక్యాన్ని తెలుసుకొని", సువార్తను నమ్మి నీటి బాప్తిస్మం పొందారు అని బైబిలు తేటగా చెబుతోంది. అయినా వారి కొరకు ప్రార్థించడానికి పేతురు, యోహానులు అక్కడికి వచ్చారు, "వారు పరిశుద్ధాత్మ పొందునట్లు" వారక్కడికి వచ్చారని లేఖనం చెబుతోంది. అదెలా స్పష్టంగా తెలుస్తుంది?

పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొందినట్లు బైబిలు చెప్పడం లేదు. కాని వారిని ఆశ్చర్య పరచే విధంగా ఒక సంఘటన జరిగింది. పేతురు, యోహానులు సమరయ క్రైస్తవుల తలలపై చేతులుంచగానే ఏమి జరిగిందో చూసిన సీమోను అనే వ్యక్తి తానుగా ఇతరులకు పరిశుద్ధాత్మను ఇవ్వగలుగునట్లు ఆ సమర్థతను వారినుండి కనుక్కోవాలని ప్రయత్నించాడు:

అప్పుడు పేతురును యోహానును వారిమీద చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందిరి. అపొస్తలులు చేతులుంచుట వలన పరిశుద్ధాత్మ అనుగ్రహింపబడెనని సీమోను చూచి వారి యెదుట ద్రవ్యము పెట్టి నేనెవని మీద చేతులుంచుదునో వాడు పరిశుద్ధాత్మను పొందునట్లు ఈ అధికారము నాకియ్యుడని అడిగెను (అపొ 8:17-19)

సీమోనును అంతగా ఆకర్షించిన సంఘటన ఏమి జరిగివుంటుంది? దయ్యాలనుండి విడిపింపబడిన వారిని, పక్షవాతపు రోగం నుండి స్వస్థపడిన వారికి జరిగిన అద్భుతాలు ఇప్పటికే సీమోను చూశాడు (అపొ 8:6-7). అసలు సీమోనే ఒక మాంత్రికుడు. మంత్ర తంత్ర విద్యలతో సమరయులను ఆశ్చర్యపరచిన వాడు (అపొ 8:9-10). అలాంటి సీమోనే పేతురు, యోహానులు ప్రార్థించినప్పుడు జరిగిన సంఘటన అతనెప్పుడూ ఊహించనిదై ఉంటుంది. అదేంటో మనం ఖచ్చితంగా చెప్పలేకపోయినా, క్రైస్తవులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందినప్పుడు ఏమి జరిగిందని అపొస్తలుల కార్యాల గ్రంథం వివరిస్తుందో అలాగే అప్పుడు వారు అన్య భాషలలో మాట్లాడుట సీమోను చూసి ఉంటాడని భావించడం సమంజసమే.

## దమస్కులో సౌలు

పరిశుద్ధాత్మను పొందినట్టు మూడవదిగా అపొ॥ కార్యాల్లో చెప్పిన వ్యక్తి తార్సు వాడైన సౌలు. ఆ తర్వాత ఆయనే అపొస్తలుడైన పౌలుగా ప్రసిద్ధి గాంచాడు. పౌలు దమస్కుకు వెళ్లే మార్గమధ్యంలో రక్షణ పొందాడు. అక్కడే ఆయన తాత్కాలికంగా గుడ్డివాడైనాడు. పౌలు మారుమనస్సు పొందిన మూడు రోజులకు అననీయ అన్న వ్యక్తి దైవిక అదేశంతో పౌలు దగ్గరకు వచ్చాడు:

అననీయ వెళ్లి ఆ యింట ప్రవేశించి, ఆతని మీద చేతులుంచి సౌలా సహోదరుడా నీవు దృష్టిపొంది, పరిశుద్ధాత్మతో నింపబడునట్లు నన్ను పంపియున్నాడని చెప్పెను. అప్పుడే అతని కన్నులనుండి పొరలవంటివి రాలగా దృష్టికలిగి, లేచి బాప్తిస్మము పొందెను, తరువాత ఆహారము పుచ్చుకొని బలపడెను (అపొ 9:17-18).

మనకు ప్రార్థన చేయడానికి అననీయ రాకముందే సౌలు తిరిగి జన్మించాడనడంలో సందేహం లేదు. అతడు దమస్కు మార్గంలో ఉండగానే ప్రభువైన యేసును నమ్మాడు. వెంటనే

తన నూతన ప్రభువు ఉపదేశాలకు విధేయుడైనాడు. అంతేగాక అననీయ సౌలును మొదట కలుసు కొన్నప్పుడు "సౌలా సహోదరుడా" అని పిలిచాడు. సౌలు మళ్ళీ చూపుపొందినట్లు పరిశుద్ధాత్మతో నింపబడినట్లు తాను వచ్చానని అననీయ పౌలుతో చెప్పిన మాటలు గమనించండి. అలా సౌలు తను రక్షణ పొందిన మూడు రోజులకు పరిశుద్ధాత్మతో నింపబడ్డాడు లేదా పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొందాడు.

సౌలు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన సంఘటనను లేఖనములో వ్రాయలేదు. కాని పౌలు ఉంటున్న చోటికి అననీయ వచ్చినప్పుడు అది జరిగివుంటుంది. ఎప్పుడో ఒకసారి పౌలు అన్యభాషలతో మాట్లాడి ఉంటాడు. ఎందుకంటే 1కొరింథీ 14:18లో "నేను మీ యందరి కంటె ఎక్కువగా భాషలతో మాటలాడుచున్నాను. అందుకు దేవుని స్తుతించెదను" అని అన్నాడు.

## కైసరయ

విశ్వాసులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన నాల్గవ సంఘటనను అపొ 10లో చూస్తాము. కైసరయలోని కొర్నేలి యింటివారికి సువార్తను బోధించడానికి దైవా వేశంతో పేతురు వచ్చాడు. యేసులో, విశ్వాసం ద్వారా రక్షణ పొందవచ్చని పేతురు చెప్పిన వెంటనే ఆ మాటలు విన్న అన్యులందరూ విశ్వాసంతో స్పందించగా, పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చాడు.

> పేతురు ఈ మాటలు ఇంక చెప్పుచుండగా అతని బోధ విన్న వారందరి మీదికి పరిశుద్ధాత్మ దిగెను. సున్నతి పొందిన వారిలో పేతురుతో కూడ వచ్చిన విశ్వాసులందరు పరిశుద్ధాత్మ వరము అన్యజనులమీద సయితము కుమ్మరింపబడుట చూచి విభ్రాంతినొందిరి. ఏలయనగా వారు భాషలతో మాటలాడుచు దేవుని ఘనపరచుచుండగా వినిరి. అందుకు పేతురు మన వలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్లకు ఆటంకము చేయగలడా అని చెప్పి, యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను. తరువాత కొన్ని దినములు తమ యొద్ద ఉండుమని వారతని వేడుకొనిరి (అపొ 10:44-48).

ఈ విషయంలో యేసుక్రీస్తును నమ్మిన మొదటి అన్యులు కొర్నేలి యింటి వారే అనిపిస్తుంది. వారు ఆయన్ను నమ్మడం, తిరిగి జన్మించడం, పరిశుద్ధాత్మలో బాప్తిస్మాన్ని పొందడం అన్నీ ఒకేసారి జరిగినట్లు కనిపిస్తుంది.

ఈ లేఖన భాగానికి పైన క్రింద ఉన్న భాగాలను చదివితే ఆ అన్యులైన విశ్వాసులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందడానికి, పేతురు, అతని సాటి విశ్వాసులు వారిపై చేతులుంచేంత వరకు దేవుడెందుకు ఆగలేదో కారణం తెలుస్తుంది. ఎందుకంటే అన్యులు యేసును నమ్మి రక్షణ పొందగలరని మరియు పరిశుద్ధాత్మను పొందగలరన్న విషయాన్ని పేతురు గాని ఇతర యూదా విశ్వాసులు గాని నమ్మలేదు! కొర్నేలి ఇంటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందాలని వారు ఎప్పటికీ ప్రార్థించి వుండరు. అందుకని దేవుడే సర్వాధికారంతో వ్యవహరించాడు. దీని

ద్వార తనకు అన్యుల పట్ల గల ఆశ్చర్యకరమైన కృప ఎలాంటిదో పేతురుకు అతని సహచరులకు దేవుడే బోధించాడు.

కొర్నేలి ఇంటి వారు నిజంగా పరిశుద్ధాత్మను పొందారని పేతురు ఇతర యూదా విశ్వాసులు ఎలానమ్మి వుంటారు? లూకా యిలా వివరించాడు, "వారు భాషలతో మాటలాడుచు దేవుని ఘనపరచు చుండగా వినిరి" (అపొ 10:46). పెంతెకోస్తు రోజున నూట ఇరవైమంది పరిశుద్ధాత్మను పొందినట్లే అన్యులు కూడా పొందారని పేతురు ప్రకటించాడు (10:47 చూడండి).

## ఎఫెసు

విశ్వాసులు పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొందిన అయిదవ రుజువును అపొ 19లో చూస్తాం. అపొస్తలుడైన పౌలు ఎఫెసులో నుండి వెళ్తూ కొందరు శిష్యులను కలుసుకున్నాడు వారిని "మీరు విశ్వసించినప్పుడు పరిశుద్ధాత్మను పొందారా?" అని ప్రశ్నించాడు (అపొ 19:2).

క్రొత్తనిబంధనలోని ఎక్కువ పత్రికలు వ్రాసిన పౌలు యేసును నమ్మడం సాధ్యమే కాని పరిశుద్ధాత్మను పొందడం అంత సులభం కాదని స్పష్టంగా నమ్మాడు. లేకుంటే "మీరు పరిశుద్ధాత్మను పొందారా?" అన్న ప్రశ్న అడిగి ఉండేవాడు కాదు.

అందుకు వారు అసలు పరిశుద్ధాత్మను గూర్చి ఇంతవరకు మేము వినసే లేదని చెప్పారు. వాస్తవానికి బాప్తిస్మమిచ్చు యోహాను రాబోవు మెస్సీయను గూర్చి చెప్పడం వారు విన్నారు. ఆయనే వారికి బాప్తిస్మమిచ్చాడు. వారి జవాబు విన్న పౌలు వెంటనే వారికి నీటి బాప్తిస్మం యిచ్చాడు. ఆ బాప్తిస్మముతో నిజమైన క్రైస్తవ బాప్తిస్మ అనుభవాన్ని పొందారు. చివరికి వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందునట్లు పౌలు వారి మీద చేతులుంచాడు.

> వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి. తరువాత పౌలు వారిమీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలతో మాటలాడుటకును ప్రవచించుటకును మొదలు పెట్టిరి, వారందరు ఇంచుమించు పండ్రెండుగురు పురుషులు (అపొ 19:5-7).

ఈ పన్నెండుమంది పౌలును కలుసుకొనక ముందు తిరిగి జన్మించారా లేదా అన్న దానికి సంబంధం లేకుండానే రక్షణపొందిన తర్వాతే పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందారనడానికి సూచనగా వారు భాషలలో మాట్లాడారు (వీరి విషయములో కూడా ప్రవచనము).

## అభిప్రాయము

తనయందు నమ్మికయుంచిన వారు క్రొత్త భాషలలో మాట్లాడతారని యేసు చెప్పాడు. కనుక సమరయులు అన్యభాషలలో మాట్లాడిన విషయం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు.

కాగా తిరిగి జన్మించిన వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందడమనే ఆత్మ యిచ్చే మరో అనుభవాన్ని పొందుతారన్న రుజువు కనబడుతోంది. అంతేకాక, ప్రతి విశ్వాసి తాను పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన తర్వాత అన్యభాషలలో మాట్లాడటానికి ఎదురు చూడాలి.

## పరిశుద్ధాత్మ బాప్తిస్మం ఎలా పొందాలి

దేవుడిచ్చే అన్ని వరాల లాగే పరిశుద్ధాత్మను కూడా విశ్వాసం వల్లనే పొందుతాము (గలతీ 3:5). పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందాలన్న విశ్వాసం కలిగి ఉండాలంటే అది తన పట్ల దేవుని చిత్తమని మొదటిగా విశ్వాసి నమ్మాలి. ఒకవేళ విశ్వాసి అశ్చర్యపోయినా, సందేహించినా అతడు పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొందడు (యాకోబు 1:6-7).

ఈ విషయంలో దేవుని చిత్తమేమిటో యేసు స్పష్టంగా చెప్పాడు, గనుక తాను పరిశుద్ధాత్మ పొందాననుకోవడానికి విశ్వాసికెలాంటి సందేహం ఉండదు.

> కాబట్టి మీరు చెడ్డవారైయుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించుననెను (లూకా11:12-13).

యేసు చేసిన ఈ వాగ్దానాన్ని బట్టి దేవుని బిడ్డయైన ప్రతిఒక్కరూ తాను పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొందుతానని నమ్మాలి.

దేవుని పిల్లలు (దేవుని తమ 'పరలోక తండ్రి'గా భావించే ప్రజలకు మాత్రమే) తనను అడిగితే పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తానని దేవుడన్నాడని యేసు వాగ్దానం చేశాడు. గనుక రక్షణ పొందిన తర్వాతే పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందటం జరుగుతుందన్న సత్యాన్ని ఈ వచనం బలపరుస్తుంది. ఒక వ్యక్తి రక్షణపొందిన సమయంలో పరిశుద్ధాత్మ వలన తిరిగి జన్మించిన అనుభవం మాత్రమే అయితే యేసు చేసిన వాగ్దానానికి అర్థమే ఉండదు. కొందరు ఆధునిక వేదాంతుల్లాగాక, ఇప్పటికే తిరిగి పుట్టిన వారు పరిశుద్ధాత్మ కొరకు దేవుని అడగడం సరైన విధానం అని యేసు నమ్ముతున్నాడు.

యేసుక్రీస్తు చెప్పిన దాన్ని బట్టి పరిశుద్ధాత్మను పొందాలనుకొన్న వ్యక్తి రెండు షరతులను నెరవేర్చాలి. మొదటిది, నీవు తిరిగి పుట్టి ఉంటే దేవుడతనికి తండ్రియై ఉండాలి. రెండోది, పరిశుద్ధాత్మ కోసం నీవు ఆయనను తప్పక అడగాలి.

చేతులు తలపై ఉంచుట ద్వారా పరిశుద్ధాత్మను పొందడం లేఖనాధారమైనది (అపొ 8:17; 19:6 చూడండి). అయినా అలా చేస్తే పరిశుద్ధాత్మను పొందాలన్న అవసరతలేదు. ఏ క్రైస్తవుడైనా తానున్న చోటనే ప్రార్థన ద్వారా పరిశుద్ధాత్మను పొందవచ్చు. కాని దాని కోసం అతను అడగాలి, విశ్వాసంతో పొందాలి. ఆత్మ అతని కిచ్చిన రీతిని బట్టి అతడు భాషలతో మాట్లాడటం మొదలు పెట్టవచ్చు.

### సాధారణ భయాలు

తాము పరిశుద్ధాత్మ కోసం ప్రార్థన చేస్తే పరిశుద్ధాత్మకు బదులు దురాత్మకు తాముగా అవకాశం ఇచ్చినట్లవుతుందేమోనని కొందరు అనుమానపడతారు. అలాంటి సందేహానికి ఆధారమే లేదు. ఎందుకంటే:

> మీలో తండ్రియైన వాడు తన కుమారుడు చేపనడిగితే చేపకు ప్రతిగా

పాము నిచ్చునా? గుడ్డు నడిగితే తేలు నిచ్చునా? కాబట్టి మీరు చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించుననెను (లూకా 11:11-13).

పరిశుద్ధాత్మ కోసం మనం అడిగితే ఆ పరిశుద్ధాత్మను దేవుడు మనకిస్తాడు. పరిశుద్ధాత్మ కాక మరొక దానిని పొందుతామేమో నన్నభయం మనకుండదు.

అన్యభాషలలో తాము మాట్లాడినప్పుడు పరిశుద్ధాత్మ అనుగ్రహించిన మానవాతీతమైన భాషకు బదులు అర్థం లేని భాషను తాము మాట్లాడతామేమోనని కొందరనుకుంటారు. ఒకవేళ పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందక, ముందు నమ్మదగిన భాషలో మాట్లాడాలని నీవు ప్రయత్నిస్తే అది అసంభవమని నీకే తెలుస్తుంది. అంతేగాక నీవు అన్యభాషలలో మాట్లాడుతున్నప్పుడు నీ పెదాలను, నాలుకను, స్వరపేటికను నీకు తెలిసే ఉపయోగించాలని నీవు అర్థం చేసుకోవాలి. నీ కోసం పరిశుద్ధాత్మ మాట్లాడడు, ఆయన నిన్ను మాట్లాడేటట్టు మాత్రమే చేస్తాడు. ఆయన మనకు సహాయకుడే గాని మన పనిచేసేవాడు కాడు. బైబిలు బోధిస్తున్నట్టు నీవే అసలు మాటలు మాట్లాడాలి:

***అందరు*** పరిశుద్ధాత్మతో నిండినవారై ***ఆ ఆత్మ వారికి వాక్ శక్తి*** అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి (అపొ 2:4).

తరువాత పౌలు వారిమీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చెను. అప్పుడు ***వారు*** భాషలతో మాటలాడుటకును ప్రవచించుటకును మొదలు పెట్టిరి (అపొ19:6).

పరిశుద్ధాత్మ వరం కోసం ఒక విశ్వాసి అడిగిన తరువాత తాను అన్యభాషలలో మాట్లాడగలనని నమ్మి, ఆ భాషలలో మాట్లాడటానికి ఎదురు చూడాలి. పరిశుద్ధాత్మ విశ్వాసంతో పొందేది కనుక దానిని పొందేవ్యక్తి తాను ఏవైన శారీరక ప్రేరణలు పొందుతానేమోనని అనుకోకూడదు. అతడు పరిశుద్ధాత్మ అనుగ్రహించే నూతన శబ్దాలను, మాటలను నోరు తెరచి భాషగా మాట్లాడాలి. విశ్వాసి విశ్వాసంతో మాట్లాడ లేక పోతే అతని నోటి నుండి ఒక్క మాటకూడా రాదు. అతడు మాటాడటం మొదలు పెడితే పరిశుద్ధాత్మ మాటలను అతనికి ఇస్తాడు.

## మాట్లాడ్డానికి మూలాధారం

ఒక విశ్వాసి భాషలలో ప్రార్థిస్తున్నప్పుడు ఆ ప్రార్థనను అతని మనస్సు కాక అతని ఆత్మ ప్రార్థిస్తుందని పౌలు చెప్పాడు.

నేను అర్థము చెప్పు శక్తికలుగుటకై ప్రార్థన చేయవలెను. నేను భాషతో ప్రార్థన చేసినయెడల నా ఆత్మ ప్రార్థనచేయును గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు. కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును; ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును (1కొరింథీ 14:14-15).

తాను భాషలో ప్రార్థించినప్పుడు అతని మనస్సు ఫలవంతంగా ఉండదు అని పౌలు చెప్పాడు. అంటే ఆ ప్రార్థనలో తన మనస్సు కెలాంటి పాలులేదు. భాషలలో తాను ఏమని ప్రార్థన చేస్తున్నాడో తనకు అర్థం కాదు. కాగా తాను ప్రార్థనలో ఏమి చెబుతున్నాడో అర్థం గాకుండా సమయమంతా ప్రార్థించే కంటే తన స్వంత భాషలో ప్రార్థిస్తు కొంత సమయాన్ని గడిపాడు పౌలు. ప్రార్థనలో ప్రార్థించడానికి పాటలు పాడడానికి రెంటికీ సమానమైన స్థానం ఉంది. సమానమైన పౌలు ఉదహరణను మనం వివేకముతో అనుసరించాలి.

పౌలు విషయం గమనించండి ఆయన భాషలలో ఎంతగా మాట్లాడగలడో అంతగా తన ఉద్దేశపూర్వకంగా తన స్వంత భాషతోనూ మాట్లాడగలడు. కనుకనే నేను "భాషతో ప్రార్థన చేతును మనస్సుతోను ప్రార్థన చేతును" అని అన్నాడు. ఆధునిక భాషలలో మాట్లాడటం ఆత్మపరంగానైతే ఆ భాష మాట్లాడే వ్యక్తికి ఆ మాట వాడటం మీద అదుపు ఉండదు. ఒకవేళ అదుపు ఉంటే దేవుణ్నే అదుపు చేసే నేరం అవుతుంది అని విమర్శకులు అంటారు. కాని అలాంటి అభిప్రాయం వున్నట్టు కనిపించదు. ఆధునిక ప్రాచీన భాషలలో మాట్లాడటం దేవుని ప్రణాళికైతే అలా మాట్లాడటం ఆ వ్యక్తి అదుపులో వుంటుంది. నిజంగా దేవుడు చేసిన చేతులుగల వారు, వారి చేతులు చేసే దానిపై వారికి అదుపు ఉండదు. తమ మనస్సాక్షి ప్రకారం నిర్ణయాలు తీసుకునే వారు దేవుణ్ని అదుపుచేయడానికి తమ చేతులు ప్రయత్నించేట్టుగా ప్రయత్నిస్తారని కూడా విమర్శకులు అంటారు.

నీవు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందితే నీవు మాట్లాడే భాషలు నీ మనసులో నుండిగాక ఆత్మనుండి వస్తున్నవని నీవు నిరూపించగలవు. మొదటిగా నీవు పుస్తకం చదువుతూ అదే సమయంలో మరొకరితో సంభాషణ కొనసాగించడానికి ప్రయత్నించేటప్పుడు ఆ రెండు పనులు ఒకేసారి చేయలేవని తెలుసుకో గలుగుతావు. ఎందుకంటె భాషలలో మాట్లాడటం నీ ఆత్మ నుండి వస్తుంది. కాగా ప్రార్థించడానికి నీ ఆత్మను ఉపయోగిస్తుండగా, చదవడానికి, దాన్ని అర్థం చేసుకోడానికి నీ మనస్సును ఉపయోగించుకో గలవు.

## ఇప్పుడు నీవు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందావు

దేవుడు నీకిచ్చిన ఆత్మఫలాలు, వరాలను ప్రత్యక్షపరుస్తూ మొదటిగా నీ వాయనకు సాక్షిగా ఉండాలని దేవుడు నీకు పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చాడన్న విషయాన్ని ఎప్పుడూ నీ మనస్సులో ఉంచుకోవాలి (1కొరింథీ 12:4-11; గలతీ 5:22-23చూడండి). తర్వాత క్రీస్తు వంటి జీవితాన్ని జీవిస్తూ ఆయన ప్రేమను, ఆనందాన్ని, సమాధానాన్ని వాటితో బాటు మానవాతీతమైన ఆత్మ వరాలను ప్రపంచానికి బయలుపరుస్తూ ఉంటే, ఇతరులను తన దగ్గరకు ఆకర్షించుకోడానికి దేవుడు నిన్ను ఉపయోగించుకొంటాడు. నీ ఆంతర్య పురుషుని నుండి ప్రవహించు "జీవజలనదులలో" భాషలలో మాట్లాడే సమర్థత ఒక వరం మాత్రమే.

అంతేగాక, మనం లోకంలోని ప్రజలందరికీ సువార్తను ప్రకటించ గలుగునట్లు దేవుడు మనకు పరిశుద్ధాత్మను అనుగ్రహించాడని జ్ఞాపకం ఉంచుకోవాలి (అపొ 1:8 చూడండి). మనం అన్యభాషలలో మాట్లాడుతున్నప్పుడు మనం మాట్లాడుతున్న భాష ఒక మారుమూల

నున్న జాతి, లేక ఇతర జాతి భాష అయివుంటుందని మనం గ్రహించాలి. మనం భాషలలో ప్రార్థిస్తు ఉన్నప్పుడల్లా ప్రతి భాష మాట్లాడే ప్రజలు యేసు సువార్తను వినాలని దేవుడు కోరుకొంటున్నాడని మనం మనస్సునందు ఉంచుకోవాలి. యేసు తన శిష్యుల కిచ్చిన మహానియామకాన్ని నెరవేర్చడానికి ఆపనిలో మనమెలా పాల్గొనాలో ప్రభువును అడగాలి.

మనకు వీలైనంతగా మనం భాషలలో మాట్లాడుతూ ఉండాలి. ఆధ్యాత్మిక శక్తి ఉత్పాధనా కేంద్రమైన (పవర్ హౌస్) పౌలు ఇలా వ్రాశాడు, "నేను మీ అందరికంటె ఎక్కువగా భాషలలో మాటలాడుచున్నాను. అందుకు దేవుని స్తుతించెదను" అని అన్నాడు (1 కొరింథీ 14:18). అన్యభాషలలో ఎక్కువగా మాట్లాడే సంఘానికి అయినా మాటలు వ్రాశాడు. కనుక వారు చేసిన దానికంటె ఎక్కువగా చేయడానికి పౌలు ఎక్కువగా భాషలలో మాట్లాడాడు. భాషల్లో మాట్లాడటం అనేది మనలో నివసిస్తూ పౌలు 1థెస్స 5:17లో చెప్పినట్లుగా "ఎడతెరిపి లేకుండా ప్రార్థించే"లా సహాయపడుతున్న పరిశుద్ధాత్మ యొక్క ఉనికిని మనం గ్రహించేలా సహాయపడుతుంది.

అన్యభాషలలో మాట్లాడటం వలన అది విశ్వాసికి మరింత క్షేమాభివృద్ధిని కలిగిస్తుందని పౌలు 1కొరింథీ 14:4లో కూడా బోధించాడు. భాషలలో మాట్లాడుట వలన ఒక విధంగా మనకు పూర్తిగా అర్థం కాకుండానే మన ఆంతర్య పురుషుని బలపరచుకోగలుగుతాం. అన్య భాషలలో మాట్లాడటం వలన అది ప్రతి విశ్వాసి ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందిస్తుంది.

మీరొకసారి పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందిన తర్వాత, మీ నూతన భాషలో ప్రతి రోజు దేవునికి ప్రార్థిస్తు కొంత సమయాన్ని గడపమని మిమ్ములను ప్రోత్సహిస్తున్నాను. ఆ అలవాటు మిమ్ములను ఆధ్యాత్మిక జీవితాన్ని దానిలో మీ ఎదుగుదలను పెంపొందిస్తుంది.

## కొన్ని సాధారణ ప్రశ్నలకు జవాబులు

భాషలలో ఎప్పుడూ మాట్లాడని వారు ఎన్నటికీ పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని పొందలేరని ఖచ్చితంగా చెప్పగలమా? వ్యక్తిగతంగా నేనైతే అలా చెప్పలేను.

పరిశుద్ధాత్మ బాప్తిస్మం కోసం నేను ప్రార్థించిన వారితో భాషలలో మాట్లాడటానికి ఎదురు చూడండి అని వారిని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటాను. ఇన్ని సంవత్సరాల నా సేవానుభవంలో నేను వారి కోసం ప్రార్థించిన కొన్ని క్షణాలలోనే వారిలో 95 శాతం మంది ఆ వరాన్ని పొందారు. ఇన్ని సం॥లలో ఆ సంఖ్య వేలలో ఉంటుంది.

ఆత్మ బాప్తిస్మం విశ్వాసం ద్వార పొందేది, భాషలలో మాట్లాడటం స్వచ్ఛందమైంది. కనుక ఆత్మ బాప్తిస్మం పొందాలని ప్రార్తిస్తూ ఉండి భాషలలో మాట్లాడని క్రైస్తవుడు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందడని నేనెప్పుడూ చెప్పను. అయినా కూడా పరిశుద్ధాత్మ బాప్తిస్మం కోసం ప్రార్థించే వారితోను, ఎన్నడూ భాషలలో మాట్లాడని వారితో నేను మాట్లాడే అవకాశం నాకు వస్తే అలాంటి వారికి అపొస్తలుల కార్యాల గ్రంథంలో ఈ అంశానికి సంబంధించిన లేఖన భాగాలను చూపిస్తాను. ఇంకా ఆ విశ్వాసికి పౌలు భాషలలో మాట్లాడినప్పుడు, మాట్లాడనప్పుడు కూడా తాను తన అదుపులో ఉన్నానని వ్రాసిన భాగాలను కూడా చూపిస్తాను. పౌలు లాగే నేను కూడా నేను

కోరినప్పుడు భాషలలో మాట్లాడగలను. అలాగే మళ్ళీ భాషలలో మాట్లాడ కూడదని నాకనిపించినప్పుడు మాట్లాడకుండా ఉండగల నిర్ణయాన్ని తీసుకోగలను. అది అలావుండగా, నేను పరిశుద్ధాత్మలో బాప్తిస్మాన్ని పొందాను. ఆత్మ మాట్లాడే శక్తినిచ్చి సహకరించనప్పుడు నేను ఎప్పుడూ భాషలలో మాట్లాడ లేదు.

మళ్ళీ చెబుతున్నాను, పరిశుద్ధాత్మ బాప్తిస్మం కోసం విశ్వాసంతో ప్రార్థించిన క్రైస్తవునితో ఎన్నడూ భాషలలో మాట్లాడని వారితో మాట్లాడే అవకాశం నాకు వచ్చినప్పుడు అతనితో నీవు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందవని చెప్పను (పొందడన్న మాటను కూడా నేను నమ్మను). భాషలలో మాట్లాడటం మనకు తెలియకుండా పరిశుద్ధాత్మ చేసే పని కాదని, పరిశుద్ధాత్మ వాక్కును యిస్తాడని అయితే ఆ వ్యక్తికి తెలిసిన భాషలో మాట్లాడినట్టే భాషలో మాట్లాడాలని అతనికి వివరిస్తాను. తర్వాత పరిశుద్ధాత్మతో సహకరించి భాషలలో మాట్లాడటం మొదలు పెట్టమని అతన్ని ప్రోత్సహిస్తాను. అలా చేసినవారిలో దాదాపుగా ఎవరూ మినహాయింపు లేకుండా అందరూ త్వరలోనే భాషలలో మాట్లాడ గలుగుతారు.

## అందరూ భాషలలో మాట్లాడలేరని పౌలు వ్రాయలేదా?

"అందరూ భాషలతో మాటలాడుచున్నారా?", అని పౌలు చాతుర్యంగా ప్రశ్నించాడు (1కొరింథీ 12:30). దానికి "లేదు" అన్న స్పష్టమైన జవాబు క్రొత్తనిబంధన అంతటికీ అన్వయించే జవాబు వస్తుంది. ఆత్మ వరాలన్నీ ఆత్మ చిత్త ప్రకారమే ప్రత్యక్షపరచ బడతాయన్న ఆయన బోధకు చెందిన సందర్భోచితమైనది "అందరూ భాషలతో మాటలాడుచున్నారా?" అన్న ప్రశ్నను (1కొరింథీ 12:11లో చూడండి). పౌలు ఆత్మ పరమైన వివిధ రకాల భాషలను గూర్చి వివరంగా రాస్తున్నాడు (1కొరింథీ 12:10). దాని ప్రకారం, భాషలను వివరించే ఆత్మ వరంతో అది కలసి ఉంటుంది. కొరింథీయులు ఈవిధమైన ప్రత్యక్ష వరాన్ని తమ సంఘాల్లో ప్రత్యక్షపరచడం లేదు. వారు అర్థం చెప్పకుండానే బహిరంగంగా భాషలలో మాట్లాడుతున్నారు కనుక బహిరంగ సమావేశంలో వివరణ చెప్పే వరాన్ని యివ్వకుండా భాషలను మాట్లాడే వరాన్ని పరిశుద్ధాత్మ ఎందుకిస్తున్నాడు? అని మనలో ప్రశ్న వస్తుంది. అలా పరిశుద్ధాత్మ ఇవ్వడు అన్నది జవాబు. అలాకాకుంటే దేవుని చిత్తం కాని దాన్ని ప్రచురిస్తున్నాడని అర్థమే.

కొరింథీయులు తమ ఆరాధనలలో భాషలకు వివరణ లేకుండా భాషలలో పెద్దగా ప్రార్థన చేస్తూ ఉండివుండవచ్చు. దీన్నిబట్టి భాషలలో మాట్లాడటం వలన రెండు ప్రయోజనాలున్నాయని తెలుస్తుంది. ఒకటి ఏకాంతంగా భాషలలో ప్రార్థించవచ్చని అలాంటప్పుడు దీనికి వివరణ ఉండదని పౌలు చెప్పాడు. పౌలు ఇలా రాశాడు: "నేను భాషలో ప్రార్థన చేసిన యెడల నా ఆత్మ ప్రార్థన చేయునుగాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు" (1కొరంథీ 14:14). పౌలు భాషలలో మాట్లాడుతున్నప్పుడెల్లా తానేం చెబుతున్నాడో అతనికి తెలియదని స్పష్టమవుతోంది. అంటే ఆయనే భాషలతో ఏమి మాట్లాడుతున్నాడో ఆయనకు అవగాహనవుండదు, దానికి వివరణ ఉండదు.

రెండవది, సంఘ బహిరంగ సమావేశంలో భాషలలో మాట్లాడేటప్పుడు దానికి

వివరణ చెప్పే వరం కూడా తప్పక దాని ననుసరించి ఉంటుంది. అది పరిశుద్ధాత్మ తన చిత్త ప్రకారం ఒక వ్యక్తి మీద సంచరిస్తూ ఆ వరాన్ని అతనికి అనుగ్రహిస్తాడు. ఆ వ్యక్తి భాషలలో బహిరంగంగా మాట్లాడతాడు. తర్వాత దానికి వివరణ యివ్వబడుతుంది. అట్లని దేవుడు ప్రతి ఒక్కరినీ అలా ఉపయోగించుకోడు. అందుకనే అందరూ భాషలలో మాట్లాడరని పౌలు వివరించాడు. దేవుడు ప్రతి ఒక్కరినీ భాషలకు వివరణ చెప్పడానికి ఉపయోగించు కొననట్లే హఠాత్తుగా అప్పటికప్పుడు భాషలలో మాట్లాడే వరంతో దేవుడు అందరినీ వుపయోగించుకొనడు. ‘‘అందరు భాషలతో మాటలాడుచున్నారా?’’ అన్న పౌలు ప్రశ్నకు మిగతా లేఖన బోధతో పైచెప్పుకున్న విధానంతో సమాధానపడటం ఒక్కటే మార్గం.

పౌలు లాగే నేను కూడా మాట్లాడాలను కొన్నప్పుడు భాషలలో మాట్లాడగలను. అయితే మేము భాషలలో ఏమి మాట్లాడామో అదంతా ‘‘ఆత్మ యిష్టప్రకారమే’’ మాట్లాడామని పౌలుగాని, నేను గాని చెప్పలేం. అది మా యిష్టప్రకారం మాట్లాడినదే. కాగా మేము కోరుకొన్నప్పుడు ‘‘ఆత్మ చిత్త ప్రకారం’’ ఇచ్చిన భాషల వరంతో మాట్లాడినది కాక మా కోర్కె మేరకు మాట్లాడుతున్నాము. అంతేగాక నాలాగే పౌలు తానేది మాట్లాడుతున్నాడో దాని అవగాహన లేకుండా బహిరంగంగా మాట్లాడినప్పుడు ఆయన 1కొరింథీ పత్రికలో వ్రాసినట్టు భాషల వరం ఎప్పుడూ వివరణ చెప్పగల వరంతో ఉంటుంది కనుక మేము మాట్లాడేది భాషల వరంతో కాదు.

బహిరంగ సమావేశాలలో పరిశుద్ధాత్మ నా మీద సంచరిస్తూ భాషలతో మాట్లాడమని చెబుతున్నాడని నేను గ్రహించినప్పుడే భాషలలో మాట్లాడాను. కొరింథీయులలాగే నేను కూడా నా కోర్కెమేరకు భాషల వివరణ లేకుండానే భాషలలో పెద్దగా మాట్లాడాను. కాని ఆత్మ వరంతో చాలా అరుదుగా మాట్లాడాను. భాషలలో మాట్లాడమన్న వరంతో పరిశుద్ధాత్మ నామీద సంచరిస్తున్నాడని నేను తెలుసుకొని మాట్లాడినప్పుడల్లా సంఘాభివృద్ధి నిమిత్తం భాషల వివరణ ఉండేది.

ముగింపులో బైబిలు సమ్మతమేమిటో వివరిస్తాను. విశ్వాసులందరూ భాషలలో మాట్లాడతారా? అని 1 కొరింథీ 12:30లోని పౌలు అడిగిన ప్రశ్నతో ఒక నిర్ధారణకు వచ్చిన వారు వారి వివరణతో ఏకీభవించని పరిశుద్ధ గ్రంథంలోని ఇతర లేఖనభాగాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి పొరపాటు వలన దేవుని దీవెనలను కోల్పోతున్నారు.

